



విలేకరులతో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

నత్తనడకన జగనన్న ఇళ్లు

◆ ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా పట్టించుకోరా..?
◆ ఇళ్ల నిర్మాణాలు, ఇతర సమస్యలపై ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట వంటావార్పు
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ పనితీరు చూస్తుంటే మరో ఐదేళ్లకు కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. జిల్లాలో 68,288 ఇళ్లు నిర్మిస్తామని చెప్పి ఇప్పటి వరకు 6,045 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారన్నారు. ఇల్లు నిర్మించుకోకపోతే స్థలం రద్దు చేస్తారని అధికారులు నిబంధనలు విధించడంతో అర్హులుగా ఉన్న 28 వేల మంది తాము జగనన్న ఇళ్లు నిర్మించుకోలేమని రాత పూర్వకంగా ఇచ్చిన ప్రజా ప్రతినిధుల్లో చలనం లేకపోవడం విచారకరం అన్నారు. ఇంటి స్థలాలకు అర్జీ చేసుకున్న 90 రోజుల్లో స్థలం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు సంవత్సరాలు కావస్తున్న స్థలం ఇవ్వలేదన్నారు. ఒక పక్క అధికార పార్టీ నేతలు, ధనవంతులు ప్రభుత్వ భూములు వందల ఎకరాలు కబ్జా చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ వందల కోట్లు దోచుకుంటుంన్నారని విమర్శించారు. అదే పేదలకు సెంటు భూమి ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ప్రభుత్వ భూములను అప్పనంగా దోచిపెడుతున్నారని విమర్శించారు. జిల్లాలో జరిగిన భూ ఆక్రమణలపై ఈ నెల 11, 12, 13వ తేదీల్లో ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి పేదల అర్జీలను అధికారులకు అందజేశామన్నారు. వీటిని ఇంత వరకు అధికారులు పరిశీలన కూడా చేయని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ భూములు కాపాడాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జగనన్న ఇళ్లు పూర్తి చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 30 గంటల పాటు వంట వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సాగు భూముల సమస్యలపై ఆందోళనలు

గార్లదిన్నె, కూడేరు, పుట్లూరు, శింగనమల, యల్లనూరు, బుక్కరాయసముద్రం, పెద్దవడుగూరు మండలాల్లో 18 గ్రామాల్లో దశాబ్ధాలుగా ప్రభుత్వ బీడు భూములను పేదలు సాగు చేసుకుంటున్నారని, వారికి సాగు పట్టాలు ఇవ్వాలని, లేని పక్షంలో దశల వారీగా ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని రాంభూపాల్ పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 18, 19 తేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద 23వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

31న కార్మిక, కర్షక సదదస్సు

కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పోరాట కార్యచరణ రూపొందించడానికి 31వ తేదీన అనంతపురం నగరంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం నుంచి అమరావతి వరకు నిర్విహిస్తున్న హైవే 544డి రోడ్డు నిర్మాసితుల సమస్యలపై ఈ నెల 20, 21వ తేదీల్లో జీపుయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్విహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను సిపిఎం జిల్లా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోలీసు స్టేషన్‌లో.. అనుమానాస్పద మృతి



మృతి చెందిన రామాంజినేయులు

◆ ఆత్మహత్య చేసుకున్నాడంటున్న పోలీసులు
◆ కొట్టి చంపారంటూ అనుమానాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో సోమవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద మృతి ఘటన చోటు చేసుకుంది. విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన ఓ వ్యక్తి స్టేషన్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. అయితే పోలీసుల చిత్రహింసల వల్లనే వ్యక్తి లాకప్‌డెత్ అయ్యాడనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... రాయదుర్గం పట్టణ పొలిమేరలోని 'పైతోట' వద్ద సోమవారం వేకువజాము 2గంటల సమయంలో ఆత్మకూరు మండలం సనప గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రామాంజనేయులు గొర్రెలు దొంగతనం చేయడానికి వచ్చారని ఆరోపిస్తూ గ్రామస్తులు పట్టుకున్నారు. వెంటనే వారిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిపై సెక్షన్ 379 కింద కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్లో ఉంచారు. వారిలో రామాంజనేయులు(28) సోమవారం వేకువజాము 2 గంటల సమయంలో పోలీస్ స్టేషన్లోని కంప్యూటర్ గదిలో అతను కట్టుకున్న లుంగీతో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. కాగ అరెస్టు చేసిన వ్యక్తిని లాకప్‌గదిలో ఉంచాల్సి ఉండగా కంప్యూటర్ గదిలో ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితులను చితకబాది ఉంటారనే అనుమానాలు బలంగా విన్పిస్తున్నాయి. నిందితులను లాకప్ గదిలో కాకుండా కంప్యూటర్ గదిలో ఉంచడం, నిందితుడు లుంగీతో ఆత్మహత్య చేసుకోవడం పట్ల అధికారులు, పోలీసులు పొంతలేని సమాధానాలు చెబుతుండడం కూడా అనుమానాలకు బలాన్ని ఇస్తోంది. ఇది లాకప్ డెత్తా.? లేక ఆత్మహత్యా అన్నది అధికారుల దర్యాప్తులో తేలనుంది.

సిఐ, కానిస్టేబుళ్లు సస్పెండ్ : ఎస్పీ

పోలీసు స్టేషన్‌లో నిందితుడు మృతిపై ఎస్పీ డా॥ఫక్కీరప్ప విచారణ చేపట్టారు. మంగళవారం ఉదయం ఆయన రాయదుర్గం పోలీసు స్టేషన్‌ను పరిశీలించి, వివరాలు సేకరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు గంగన్న, మధు, హోంగార్డ్ రమేష్‌లను విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. కాగ మృతి చెందిన రామాంజనేయులుపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయన్నారు. పోలీసు స్టేషన్లో జరిగిన ఈ ఘటనపై కళ్యాణదుర్గం ఆర్డీవోను మెజిస్టీరియల్ విచారణ జరపమని కోరమన్నారు. అనంతపురం డీఎస్పీ ఆధ్వర్యంలో శాఖాపరమైన విచారణకు ఆదేశాలు ఇచ్చామన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

ఆర్డీవో పరిశీలన..

పోలీసు స్టేషన్‌లో నిందితుడు అనుమానాస్పద మృతిపై కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్ రెడ్డి వివరాలు సేకరించారు. శవపరీక్ష అనంతరం ఆర్డీవో మీడియాతో మాట్లాడారు. రామాంజనేయులు మతి పట్ల తాను మేజిస్టేరిజిస్ట్రియల్ విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. మతుడి కుటుంబ సభ్యుల వాంగ్మూలం తీసుకున్నామన్నారు. శవపరీక్ష నివేదిక అనంతరం పది రోజుల్లో తన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీవో తెలిపారు.



కల్వర్టును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఇందిరానగర్ కల్వర్ట్‌ను పూర్తి చేయాలి

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరపాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్‌లోని ఇందిరానగర్ కెనాల్ దగ్గర మురికి నీరు సక్రమంగా పోయేలా కల్వర్ట్‌ను వెంటనే పూర్తి చేయాలని సిపిఎం నగర 1వ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఇందిరానగర్ కెనాల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజుల క్రితం రోడ్డులో గుంతలు తవ్వి ఇప్పటి దాకా పనులు చేపట్టలేదన్నారు. ప్రజలు నడవడానికి వీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగర పాలక సంస్థ అధికారులు చిన్న పనిని కూడా ఇన్ని రోజులు చేయడం సరికాదన్నారు. ప్రధానంగా ఇందిరా నగర్ నుంచి గంగా నగర్, ప్రియాంక నగర్, ముత్యాలమ్మ కాలనీ, రాజీవ్ కాలనీ, హెచ్ఎల్‌సి కాలనీ, అరుణోదయ కాలనీ, శ్రీశ్రీ నగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున అధికారులు ఇప్పటికైనా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, ప్రసాద్, మసూద్, రాజు, గపూర్, రాము, చిరంజీవి, చాంద్, రాఘవ, రాజు, అంజి, మోహన్, బాబు, తిప్పయ్య, ఎస్కే మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

నగరపాలక సంస్థలోని మూడవ సర్కిల్, గుత్తి రోడ్డు, నాలుగవ సర్కిల్ పరిధిలో ఉన్న పలుప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ కె.భాగ్యలక్ష్మి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చెత్త సేకరణ, పారిశుధ్య పనుల నిర్వహణ, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వర్తించేలా ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మూడు రోజులుగా వరుసగా సెలవలు ఉండడంతో ఎక్కడైనా అపరిశుభ్రత ఉందేమోనని పరిశీలించినట్లు తెలిపారు. ఎక్కడా అపరిశుభ్రత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇన్‌ఛార్జి డిఇఒగా కృష్ణయ్య బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారిగా ఎస్.కృష్ణయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ డిఇఒగా పనిచేస్తున్న కె.శామ్యూల్ రెండున్నర నెలల క్రితం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కడప ఆర్జేడీగా పనిచేస్తున్న ఎం.వెంకటకృష్ణారెడ్డి ఇన్‌ఛార్జి డిఇఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన కూడా ఐదురోజుల క్రితం మోడల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ అయిన విషయం విధితమే. ఈనేపథ్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.కృష్ణయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనాథ్, ఆదినారాయణ, సరళ, ఉద్యోగులు, ఎఎస్ఒ ఓబుల్‌రెడ్డి, ఎపిఒ నాగరాజు, డిసిఇబి సెక్రటరీ లోకేశ్వర్‌రెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు టీచర్లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన ఇన్‌ఛార్జి డిఇఓ కృష్ణయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యాలయ ఉద్యోగులు

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపిక

అనంతపురం కలెక్టరేట్ : జెవివి ఆధ్వర్యంలో జనవరి 21, 22 తేదిలో కడపలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపిక అయ్యారని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, జెవివి జిల్లా అధ్యక్షులు ఎస్.భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, కోశాధికారి రామిరెడ్డి తెలిపారు. మంగళవారం జెవివి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జెవివి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ప్రభుత్వ పాఠశాలల నుంచి కె.జయక్రిష్ణ, డి.చరణ్, ఎన్.భరత్, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు ఎన్ఎస్ఎల్.సాయి శ్రావణి, టి.నవదీప్, కె.సాయిగణేష్‌కృతీక్‌లు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు గంగేనాయక్, రామక్రిష్ణ, ప్రసాద్, మారెన్న తదితరులు పాల్గొన్నారు.



చెకుముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



వెలుగు అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

విఒఎల సమస్యలు పరిష్కరించాలని వినతి


తాడిపత్రి రూరల్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విఒఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు రూరల్ పరిధిలోని వెలుగు కార్యాలయంలో వెలుగు అధికారికి సిఐటియు నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ విఒఎలకు వేతనాలు పెంచాలని 15 సంఘాల్లోపు వారికి అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, పురుషుల తొలగింపు ఆపాలని, ఫ్రీజింగ్‌లో ఉన్న వీవోఒలను పునరుద్ధరించాలని, మూడేళ్ల కాల పరిమితి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్, హనుమంతురెడ్డి, కవిత, కేశవులు, రామ్మోహన్ పాల్గొన్నారు.

ముక్కులో గడ్డకు కిమ్స్ సవీరాలో అరుదైన చికిత్స

ప్రజాశక్తి-అనంతపురంకలెక్టరేట్

ఇన్ఫెక్షన్‌తో ముక్కులో గడ్డ ఏర్పడి, ఊపిరి తీసుకోవడం కష్టమైన ఓ వ్యక్తికి అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ ఇఎన్‌టి సర్జన్ డాక్టర్ రాఘవేంద్రరెడ్డి ఎండోస్కోపిక్ విధానంతో శస్త్రచికిత్స చేశారు. ఈమేరకు మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కంబదూరు మండలం అందెపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్‌కు మూడేళ్లుగా ముక్కు పూడిపోయినట్లుగా (బ్లాక్ అవుతుండేది) ఉండేది. దీంతో తమ వద్దకు రాగా పరీక్షిస్తే ముక్కులో గడ్డ ఏర్పడినట్లు తెలిసిందన్నారు. రోగి బాగా పేదవాడు కావడంతో ఆరోగ్యశ్రీ కింద అతడికి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించి ఎండోస్కోపిక్ విధానంలో అత్యంత జాగ్రత్తగా గడ్డను తొలగించి, దాన్ని హిస్టోపాథాలజీ పరీక్షకు పంపినట్లు తెలిపారు. ఈ పరీక్షలో అరుదైన రైనోస్పోరిడియోసిస్ అని తేలింది. సాధారణంగా ఇలాంటి ఫంగల్ ఇన్ఫెక్షన్లు తీరప్రాంతాల్లో ఉండేవారికి వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఈత కొట్టేవారు, నీరు నిల్వ ఉండేచోట పనిచేసేవారు, తీరప్రాంతాల వారికి ఎక్కువగా వస్తుందన్నారు. పొలాల్లో నీళ్లలో పని చేసేవారికి ఈ సూక్ష్మజీవి ముక్కు, కన్ను, గొంతులో ఎక్కడైనా గడ్డలను తయారు చేస్తుందన్నారు. కొన్నిసార్లు ఒకేచోట ఉండొచ్చు, కొన్నిసార్లు వేర్వేరు ప్రాంతాల్లోకి అంటే కాలు, చేతి ఎముకల్లోకి కూడా వెళ్లి గడ్డలను తయారయ్యే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో ముక్కులో గడ్డ చూడగానే రైనోస్పోరిడియోసిస్ అయి ఉండొచ్చని ఊహించి, ఎండోస్కోపిక్ విధానంలో మళ్లీ రాకుండా ఉండేలా మంచి పరికరాలను ఉపయోగించి విజయవంతంగా తీసేసినట్లు తెలిపారు. అనంతపురం, కర్నూలు ప్రాంతాల్లో 20 ఏళ్లలో ఎక్కడా ఇలాంటి సర్జరీ జరగలేదన్నారు. అంతేగాకుండా భవిష్యత్తులో ఇతనికి ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు మాత్రలు కూడా ఇచ్చినట్లు తెలిపారు.

రైనోస్పోరిడియోసిస్ సమస్యకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం



రోగికి ఎండోస్కోపిక్ చేస్తున్న వైద్యులు

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికా చట్టాన్నికొనసాగించాల్సిందే..

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డినెన్స్ జారీ చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముందుగా వేముల రోహిత్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి, అసమానతల తొలగించడానికి కెవిపిఎస్ కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని పోరాడి సాధించిన అత్యున్నత చట్టం ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికా చట్టం-2013 అన్నారు. దేశంలో దళిత గిరిజనుల ఆర్థిక ప్రగతి కోసం అనేక పోరాటాల అనంతరం 1974-75 మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రణాళికా సంఘం ద్వారా దళితులకు ప్రత్యేక ప్రణాళికను, గిరిజనులకు ఉప ప్రణాళికను ఏర్పరచి నిధులు కేటాయించిందన్నారు. స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టంగా లేని కారణంగా నిధులను జనాభా ప్రకారం కేటాయించడం, కేటాయించిన నిధులను సక్రమంగా ఖర్చు చేయడం జరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు కేటాయించిన నిధులు ఇతర వర్గాల ప్రయోజనాలకు, పథకాలకు దారిమళ్ళించి ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేశారన్నారు. ఎన్ని అవరోధాలున్నప్పటికీ ఈ విధానం వల్ల కొద్దో, గొప్పో దళిత గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటైందన్నారు. కెవిపిఎస్ పోరాటం వల్ల చట్టం వచ్చిందని గుర్తు చేశారు. ఈ చట్టం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దళితులకు విడుదలైన నిధులు 23 శాఖలకు రూ.1,18,658 కోట్లు కాని ఖర్చు చేసింది రూ.80,901 కోట్లు మాత్రమే (68 శాతం) అన్నారు. వీటి ద్వారా వ్యవసాయం ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, విద్య, వైద్య, మౌళిక సదుపాయాలు, సంక్షేమం, ఉపాధి, నైపుణాభివృద్ధికి, భూమి కొనుగోలు, కార్పొరేషన్ రుణాలు, విదేశీ విద్య లాంటి 249 పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. జగన్ ప్రభుత్వం రూ.70 వేల కోట్లుకుగాను రూ. 44వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రూ.26 వేల కోట్లు ఖర్చు చేయక వథా చేసిందన్నారు. కొన్ని శాఖలకు ఒక్క పైసా కేటాయించలేదన్నారు. నవరత్నాల పేరుతో నిధులను దారి మళ్లించారన్నారు. కావున ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని, అందుకు ఆర్డినెన్సు తెచ్చి భద్ర పరచాలని డిమాండ్ చేశారు. ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. 19వ తేదీ వరకు సచివాలయాల్లో వినతిపత్రాలు ఇవ్వడం, 20న మండలాల్లో అర్జీలు ఇవ్వడం, 23న జిల్లా కలెక్టర్ వినతి, 26న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు అర్జీలు, ఎమ్మెల్యేలకు అర్జీలు, 27న స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కెపి నారాయణస్వామి, ఎస్సీ, ఎస్టీ ఫోరం జిల్లా అధ్యక్షులు నెరమెట్ల యల్లన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు జెబి.సురేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న పెద్దన్న, లాయర్ రంగనాయకులు, సత్యమయ్య, చెన్నంపల్లి ఓబులేసు, ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు రేకులకుంట రామాంజనేయులు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పక్కీరప్ప, ఎంఎస్ఎఫ్ నాయకులు నాగేష్, సంజీవులు, బాషా, కెవిపిఎస్ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రాజా, సురేష్, నగర అధ్యక్షులు అక్కులప్ప, నాయకులు ఎర్రిస్వామి,



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిఒ చెన్నకేశవులు

'ఉపాధి' పనుల పరిశీలన

పుట్లూరు : మండల కేంద్రం సమీపంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎపిఒ చెన్నకేశవులు మంగళవారం పరిశీలించారు. ముందుగా కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చే కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. అప్పుడే సరైన కూలి పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎఫ్‌టి రామాంజనేయులురెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రవిశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవమ్మ జాతర



పూజలందుకున్న దేవమ్మ అమ్మవారు

బొమ్మనహాల్ : మండలంలోని శ్రీధర్‌గట్ట గ్రామంలో వెలసిన దేవమ్మ జాతరను భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి పవిత్రగంగను మేళతాళాలతో తీసుకొచ్చి అమ్మవారికి పన్నీటి స్నానాలు ఆచరించి, పట్టు వస్త్రాలు ధరింపజేసి, పసుపు కుంకుమ అర్పించి, ఒడిబియ్యం కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు, కలశాలను చేతపట్టి అమ్మవారికి అర్పించారు. తర్వాత అమ్మవారిని పల్లకిలో కొలువుదీర్చి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

టిడిపి కార్యకర్తలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి : మండలంలోని కేసేపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వడ్డీ సురేష్‌కు టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. ఆరోగ్యం సరిగాలేదనే విషయం తెలుసుకున్న ఆలం నరసానాయుడు కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం చేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షుడు బండి చంద్రమోహన్, అశోక్, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవాలను తొగటవీర క్షత్రియపట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల నుంచి శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతులు, కలిశాలతో పట్టణంలో ఊరేగించారు. ఆ తరువాత పట్టణంలోని 39 కమిటీలు ఏకతాటిపైకి వచ్చి అర్ధరాత్రి నుంచి 500 అమ్మవారిజ్యోతులను భక్తులు తలపై ధరించి ఆయా ప్రాంతాల నుండిమేళ తాళాలతో మంగళవారం తెల్లవారుజామున దుర్గమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ హోమగుండం ప్రవేశానంతరం ఆలయంలో అమ్మవారి ఎదుట జ్యోతులను దింపారు. వీటిని తిలకించడానికి ధర్మవరం చుట్టుపక్కల ప్రాంతాలనుండే కాక ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన తొగటవీర క్షత్రీయులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సేవాసంఘం గౌరవాధ్యక్షులు గడ్డం శ్రీనివాసులు, అధ్యక్షులు బండారు ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి శంకర యుగంధర్, సహాయకార్యదర్శి గడ్డం రంగ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-అనంతపురం

అర్బన్ పరిధిలోని రాజీవ్ కాలనీ పంచాయితీలో ఉన్న లీలమ్మకాలనీ, మహదేవ్ నగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం నగరం ంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకోవడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పలు సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా మహదేవ్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధించిన అధికారులకు సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, ఉప సర్పంచి మసూద్‌బాబు, ఎంపిటిసి రమజా, వార్డ్‌నెంబర్ రమాదేవి, నాయకులు వెంకటనారాయణ, వెంకటప్ప, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజుల్లో ఎస్టిమేట్లు సిద్ధం చేయండి..

వరదల కారణంగా దెబ్బతిన్న బ్రిడ్జి, కల్వర్టు, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి ఎస్టిమేట్లు రెండ్రోజుల్లో సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. విశ్వశాంతినగర్, మోటరో ఉదయ్ కాలనీల్లో పర్యటించి ఇటీవల వరద ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నరసింహారెడ్డి, సర్పంచి పద్మావతి, వైస్ సర్పంచి నరేంద్రరెడ్డి, వైస్ ఎంపిపి బాలాజీ, ఎంపిటిసి ఓంప్రకాశ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, ఆదినాయక్, విజయ్, కుళ్లాయప్ప, పలువురు వార్డ్ మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ 60 జిల్లాస్థాయి పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురంసిటీ



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అభయ ఫౌండేషన్, నిస్వార్థ ఫౌండేషన్ సంయుక్త అధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన సూపర్ 60 పరీక్ష ఫలితాలను కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత ఎపిఆర్‌జెసి, ఆర్జీటీ సెట్, పాలీసెట్, అగ్రిసెట్ వంటి అర్హత పరీక్షల్లో విజయం సాధించేందుకు ఇలాంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇందుకోసం అనంతపురంలోని అభయ ఫౌండేషన్ సిసిఎల్ క్యాంపస్‌లో 30 రోజులు విలువలతో కూడిన ఉచిత గురుకుల రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రెండు జిల్లాల్లో 12 కేంద్రాల్లో 2652 మంది విద్యార్థులు అన్‌లైన్‌లో పరీక్షలు రాయగా ప్రతిభ ఆధారంగా 180 మందిని ఎంపి చేసినట్లు తెలిపారు. వీరికి ఈనెల 14న అనంతపురంలో ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన 60 మందికి వసతి, మూడు పూటల భోజనం, విద్యా సామగ్రిని అభయ ఫౌండేషన్ అందిస్తూ, నిస్వార్థ ఫౌండేషన్ ద్వారా ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిస్వార్థ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, రాజేష్, శ్రీనివాస్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కాయగూరల పెద్ద వెంకటేశులు ప్రథమ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పాతూరు కూరగాయల మండి ఓనర్‌లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మంగళవారం నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్ భాష తో పాటు బండి ఓనర్లు హాజరయ్యారు. కమలా నగర్‌లోని వద్ధుల సంరక్షణ అనాధ ఆశ్రమంలో వద్ధులకు అన్నదానం వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, లలిత కళాపరిషత్ కార్యదర్శి పద్మజ, విద్యార్థి సంఘం నాయకులు ఆకుల రాఘవేంద్ర, కాయగూరల మార్కెట్ మండి ఓనర్ వెంకట, పెద్ద వెంకటేశులు కుమారులు విశ్వనాథ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సేవలను వివరించండి : బికె

ప్రజాశక్తి మడకశిర

గతంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన సేవలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని టిడిపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి నాయకులు, కార్యకర్తలను కోరారు. మంగళవారం మడకశిర పట్టణంలోని యాదవ కళ్యాణమండపంలో రియల్ టైం స్ట్రాటజీ శిక్షణ కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బికె పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందామన్నారు. ఈసందర్భంగా ఆయన గ్రామ, పట్టణాల రూపురేఖలు మార్చారని చెప్పారు. అయితే ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి ఎక్కడా కన్పించడం లేదని విమర్శించారు. ఈ ప్రభుత్వ పాలనను ప్రశ్నిస్తే కక్ష సాధింపులు చేయడం, తప్పుడు కేసులు బనాయించడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఈనేపథ్యంలో టిడిపి ఆధ్వర్యంలో చేపడుతున్న ఆర్‌టిఎస్ పార్టీ శ్రేణులను అన్ని రంగాల్లో చైతన్యపరిచి కార్యోన్ముఖులను చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, జిల్లా మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు, నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు, పట్టణ అధ్యక్షులు తదితరులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళాసంఘం డబ్బులు స్వాహా

ఫిర్యాదు చేసిన బాధిత మహిళలు

ప్రజాశక్తి గుడిబండ

మండల పరిధిలోని రాళ్లపల్లి పంచాయతీ మదిగుబ్బ గ్రామంలో వెలుగు మహిళ సంఘ సభ్యుల డబ్బులు గతంలో పనిచేసిన సిసి స్వాహా చేశాడని ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బాధిత మహిళలకు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. గ్రామంలో విజయలక్ష్మి మహిళాసంఘం నడుపుకుంటున్నామన్నారు. గతంలో సిసిగా పనిచేసిన వెంకటేష్ సంఘం ప్రెసిడెంట్, కార్యదర్శి ద్వారా ఆరు లక్షల రూపాయలు బ్యాంకులో డ్రా చేయించి ఆ డబ్బును సంఘ సభ్యులకు పంచకుండా స్వాహా చేశారని ఆరోపించారు. 2021లో ఈడబ్బులు తీసుకున్న సీసి ' మీ డబ్బులు మీకు ఇస్తాన'ని చెబుతూ వచ్చాడని అన్నారు. ఇటీవల ఇక్కడి నుండి మరో ప్రాంతానికి బదిలీపై వెళ్ళాడని డబ్బుల విషయం పలుమార్లు అడిగినా స్పందించడం లేదని వాపోయారు. సంఘంలో ఉన్న పదిమంది సభ్యులు మళ్లీ రుణాల కోసం వెలుగు అధికారులు కలిస్తే వెనుకటి అప్పును చెల్లిస్తే కొత్త రుణాలు ఇస్తామని చెబుతున్నారని అన్నారు. ఈవిషయంపై పోలీసులు జోక్యం చేసుకుని సిసి వెంకటేష్ స్వాహా చేసిన ఆరు లక్షల డబ్బులను తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు లక్ష్మమ్మ, నాగమణి, హనుమక్క, గంగమ్మ, అక్కమ్మ తదితరులు కోరుతున్నారు.

గుత్తి ఇన్‌ఛార్జి కమిషనర్‌గా శరత్‌చంద్ర

ప్రజాశక్తి-గుత్తి



కమిషనర్ శరత్‌చంద్రను సన్మానిస్తున్న సిబ్బంది

స్థానిక మున్సిపల్ ఇన్‌ఛార్జి (ఎఫ్‌ఎసి) కమిషనర్‌గా శరత్‌చంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లెల లక్ష్మీదేవి అహుడా అధికారిణిగా బదిలీపై వెళ్లారు. దీంతో ఉన్నతాధి కారులు మున్సిపల్ ఎఇగా పనిచేస్తున్న శరత్‌చంద్రను ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. దీంతో మున్సిపాలిటీలోని వివిధ విభాగాల అధికారులు శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ఇంతియాజ్, సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, ఇంజినీరింగ్ విభాగం క్లర్క్ సతీష్, ఆర్‌ఐ సికె.రామాంజనేయులు, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ తమీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మ జాతర

ప్రజాశక్తి-గుత్తి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

పట్టణంలోని జంగాల కాలనీలో వెలసిన సుంకులమ్మ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఈ జాతరకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మల్లయ్యయాదవ్, మాజీ జెడ్పిటిసి ప్రవీణ్‌కుమార్ యాదవ్, వైసిపి నాయకులు అశ్వ మారెన్న, అశ్వ చిన్నమారెన్న, అశ్వ నాగప్ప, అశ్వ సురేష్, కౌన్సిలర్ అశ్వ రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయండి

ప్రజాశక్తి-ఉరవకొండ

రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదును వేగవంతంగా పూర్తి చేయాలని విడపనకల్ తహశీల్దార్ బ్రహ్మయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వీఆర్వోలు, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఆర్వోలు, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులను సమన్వయం చేసుకుని మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన పంటలకు వందశాతం ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా 18వేల ఎకరాల్లో పప్పుసెనగ పంటను సాగు చేయగా ఇప్పటివరకు 10,500 ఎకరాల్లో మాత్రమే ఈక్రాప్ చేశారన్నారు. మిగిలిన పప్పుశనగ పంటతో పాటు మిగిలిన జొన్న, కంది తదితర పంటలను కూడా ఈక్రాప్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పేన్నయ్య, ఎఇఒ రాఘవేంద్ర, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట పెన్షనర్స్ ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్‌లకు పెన్షన్ రివిజన్ చేయాలని ఆల్ ఇండియా బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ రాజ శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 7వ సెంట్రల్ పే కమిషన్ ప్రకారం 2017 నుంచి పెన్షన్ రివిజన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎస్.సభాహాన్, నాగరాజు, ఇ.విశ్వనాథ్, పద్మనాభచారి, ముత్యాలప్ప, జాఫర్, వెంకటనారాయణ, ఉమారాణి, రాజగోపాల్ నాయకుడు, బాల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

వేమన జయంతి ఏర్పాట్ల పరిశీలన

గాండ్లపెంట : మండల పరిధిలోని కట్టారుపల్లిలో నిర్వహించే యోగివేమన జయంతి ఉత్సవాల ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యోగివేమన ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జయంతి ఉత్సవాల నిర్వహణను అధికారికంగా ప్రకటించడంతో ఈ నెల 19వ తేదీన టూరిజం శాఖ మంత్రి ఆర్కే రోజా, అధికారులు హాజరై ఉత్సవాలను ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఎంపిపి జగన్మోహన్, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, స్థానిక సర్పంచి గంగోజమ్మ ఉత్పన్న నాగభూషణం రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రహదారి భద్రత వారోత్సవాలు

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రహదారి భద్రతా వారోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 24 వరకు నిర్వహిస్తున్నట్లు మోటరు వాహనాల తనిఖీ అధికారి వరప్రసాద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా వాహన చోదకులకు భద్రత సూచనలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రోజుకోక మండలంలో ఒక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా 19నకదిరి పట్టణంలో వాహన ర్యాలీ ఉంటుందన్నారు. ఈ ర్యాలీలో కదిరి లారీ, మిని లారీ, టాక్సీ యజమానులు, డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నాణ్యతతో కూడిన ప్రథమ చికిత్స అందించాలి

చిలమత్తూరు : గ్రామీణ ప్రాంతాలలో అనారోగ్యంతో బాధపడుతూ ప్రథమ చికిత్స కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యతతో కూడిన ప్రథమ చికిత్స అందించి అవసరమైతే మండల కేంద్రంలోని పిహెచ్‌సికి రెఫర్ చేయాలని మండల వైద్యాధికారి రామక్రిష్ణ కరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్‌ఎంపిలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రథమ చికిత్స విధానంపై పలు సూచనలు చేశారు. ప్రథమ చికిత్సలో ఏవైన సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పరస్పర సహకారంతో పేద ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆర్‌ఎంపిలతో ప్రజలకు సత్ సంబంధాలు ఉన్నాయన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకొనేలా వైద్యసేవలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామ్‌కుమార్, డిటి హనుమంతు, ఆర్‌ఎంపిలు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుందాం

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో దాదాపు మూడు లక్షల ఎకరాలలో ఉన్న అడవులను కాపాడుకుందామని పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు కోరారు. మంగళవారం పుట్టపర్తి గ్రీవెన్స్ సెల్‌లో ఆయన అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయన్నారు. అడవులను కాపాడుకోవటానికి ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బసంత్ కుమార్‌ను కోరానని చెప్పారు.

నేరాలు ఘోరాలు



చోరీకిగురైన దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో) దొంగలు వేసిన కన్నం

ఉరవకొండలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానిక టవర్‌క్లాక్ సమీప ప్రాంతంలో ఉన్న సత్యనారాయణ కిరాణా దుకాణంలో, ఆర్‌కె గిఫ్ట్‌షాప్, పరి ఫ్యాషన్ దుస్తుల దుకాణం, విష్ణు దుకాణాల్లో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. దుకాణాల పైకప్పులకు రంధ్రాలు పెట్టి అందులో నుంచి ప్రవేశించి విలువైన వస్తువులు, డబ్బులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ ఎస్ఐ వెంకటస్వామి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి షాపుల యజమానుల నుంచి వివరాలు సేకరించారు. తర్వాత సీసీటీవీ ఫుటేజిని పరిశీలించారు. ఆయా ఘటనల్లో రూ.1లక్ష చోరీ జరిగినట్లు తెలుస్తోంది. సత్యనారాయణ కిరాణా దుకాణంలో 70వేలు విలువైన సిగరెట్లు, ఆర్కె గిఫ్ట్ షాపులో రూ.8 వేల నగదుతో పాటు గిఫ్ట్ ప్యాకెట్లు, మరో దుకాణంలో రూ.6వేలు విలువైన వస్తువులు, రూ.12వేలు నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాడికి : ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొన్న ఘటనలో యాడికిలోని ఓంశాంతి కాలనీకి చెందిన నరసింహాయ్య మృతిచెందిన ఘటన మంగళవారం మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వద్ద ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికిలోని ఓంశాంతి కాలనీకి చెందిన నరసింహయ్య తన సమీప బంధువుల ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో గ్రామంలోకి వెళ్తుండగా తాడిపత్రి వైపు నుంచి వచ్చి బస్సు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన నరసింహయ్యను చికిత్స కోసం స్థానికంగా ఉన్న ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురం, తర్వాత బెంగళూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

కాలువలో ఆడశిశువు లభ్యం



కాలువలో పడేసిన శిశువు

తాడిపత్రి రూరల్ : రూరల్ పరిధిలోని గన్నేవారిపల్లి కాలనీలో మంగళవారం ఓ కాలువలో ఆడ శిశువు లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. కాలనీలోని శివశంకర్ పాఠశాల సమీపంలో ఉన్న ఓ కాలువలో అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లిపోయారు. గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై గౌస్ మహమ్మద్ ఘటనా స్థలానికి చేరుకుని శిశువును వైద్య పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుత్తి : మండలంలోని పెద్దొడ్డి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన ప్రసాద్, సింహాద్రి, రంగస్వామి ఆటోలో వెళ్తుండగా గ్రామ సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు క్షతగాత్రులను అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పేకాటజూదరులు అరెస్టు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని పలు ప్రాంతాలలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ మహమ్మద్ రఫీ, ఎఎస్ఐ పుట్టప్పలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేకాట జూదరుల అరెస్టు వివరాలను వెల్లడించారు. సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా సత్యసాయి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరంలో ఎలాంటి జూదాలు. కోడిపందేటు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని కేశవనగర్, పోతిరెడ్డి గ్రౌండ్, రమణ ఇంటి ఎదుట బహిరంగ ప్రదేశాలలో పేకాట ఆడుతున్న శిబిరాలపై దాడులు నిర్వహించి 12మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. వారి వద్ద నుంచి రూ.1.73,020 నగదును స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓబులదేవరచెరువు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కొండకమర్ల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గజ్జికుంటపల్లి తండాలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖ ఫీల్డ్ ఆఫీసర్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎటిఎం, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు క్యాషియర్ సందీప్, మెసెంజర్ ప్రసాద్, నిత్యనిధి ఏజెంట్ కె. దామోదర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఓబులదేవరచెరువు : ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ సత్యసాయి జిల్లా కమిటీ రూపొందించిన 2023 సంవత్సరపు క్యాలెండర్‌ను తహశీల్దార్ కె.శ్రీధర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు కె. అక్కులప్ప నాయక్, జిల్లా అధ్యక్షుడు ఎస్ రఘునాథ నాయక్, సహాయ కార్యదర్శి దివాకర్ నాయక్, అనిల్ ప్రసాద్ నాయక్, ధోని నాయక్, జగన్ నాయక్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలి

కదిరి టౌన్ : పేదల గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. జనవరి 17 నుండి ఫిబ్రవరి 6 వరకు జరిగే సిపిఐ పోరుబాటకు సంబంధించిన గోడపత్రికలను ఈ సందర్భంగా విడుదల చేశారు. అనంతరం సిపిఐ నాయకులు కదిరప్ప మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవని దీనిని రూ. 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి లియకత్ అలీ, సహాయ కార్యదర్శి మనోహర్, రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు మధు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుడాలగొంది రమణ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ

పెనుకొండ : ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ఆవరణంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని బుధవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సవితమ్మ మంగళవారం గ్రౌండ్‌ను పరిశీలించి టోర్నీ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాధవ నాయుడు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, మిలటరీ నారాయణ, నాగరాజు రెడ్డి, అడదాకులపల్లి మాజీ సర్పంచి ప్రసాద్ త్రివేంద్ర నాయుడు, అరుణ్ రెడ్డి, మాజీ వైస్ సర్పంచి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.